తెలుగు కథా సమితి
(న్యూజెర్సీ)
చిన్న కథల పోటీలో
రు. 150
గెలుపొందిన
రచన

# ఆటబొమ్మలు

— తపతి

"అమ్మా...!"

"ఊ!... ఊ!..."

"అబ్బబ్బబ్బా... మళ్ళీ ఏం చేశావురా వెధవా!

సెలవులిచ్చి మూడురోజులన్నా కాలేదు కానీ మీ గోలతో మూడు యుగాలైనట్టుందిరా బాబూ! మాటి మాటికీ మీరిలా తన్నుకు ఛస్తుంటే మీ సెలవులయ్యేటప్పటికి నాకు పిచ్చెక్కిపోవడం మాత్రం ఖాయం!" అంటూ ఉతుకుతున్న బట్టలు వదిలి పిల్లలున్న గదిలోకి వచ్చింది శాంతి.

గదంతా చిందరవందరగా విసిరేసిన ఆటబొమ్మల మధ్య ఏడుస్తూ కూర్చుని వున్న 'చిన్నీ' ఏడ్పుని, బొమ్మబూరతో అనుకరిస్తూ గంతులేస్తున్నాడు 'బాబీ'.

తల్లిని చూడగానే "అన్నయ్య నా బొమ్మ జుట్టంతా చింపిరి చింపిరిగా పీకేశాడమ్మా" అంటూ రాగాన్ని మరింత పెంచింది చిన్నీ.

'ఆ బొమ్మతో ఎంతసేపూ నువ్వే ఆడుకుంటావు కానీ నాకొక్కసారికూడా ఇవ్వకపోతే మరేం చేస్తానేంటి?' అన్నట్టు కొరకొరా చూస్తున్న బాబీని మందలింపుగా ఓ చూపు చూసి, "పోనీలేమ్మా! నీ బొమ్మకు నేను చక్కగా తలదువ్వి రబ్బరుబాండు పెడతానుగా" అని బుజ్జగిస్తూ కూతురి ప్రక్కన కూర్చుంది శాంతి.

ఇంక అక్కడ తన ఆట పూర్తయినట్టుగా తాతగారి గదిలో దూరాడు బాబీ.

బుజ్జగింపుతో కూతుర్ని నిద్రపుచ్చి బొమ్మలన్నీ సర్దుతున్న శాంతి "గంట నుంచీ ఆ మూలన చేరి ఏమి సగబెడుతున్నావురా భడవా!" అని వినిపించిన మామగారి అరుపుతో మామగారి గదివైపు నడిచింది.

తల్లి రాకను గమనించిన బాబీ గాభరా పడుతూ చేతిలో కళ్ళజోడుని తాతగారి మీదకు గిరాటేసి మంచం కిందికి దూరిపోయాడు.

ఆ విసురులో క్రిందపడిన కళ్ళజోడు అద్దాలు కాస్త పగిలిపోయాయి.

"అయ్యయ్యో...! బంగారం లాంటి కళ్ళజోడుని బద్దలుగొట్టేశావు గదరా బాబూ!" అంటూ పగిలిన కళ్ళజోడుని చేతిలోకి తీసుకున్నారు తాతగారు.

ఒక వైపు బట్టలూ, మరోవైపు వంటా ఎదురు చూస్తుండడంతో బాబీని బయటికి లాగి దండించే పని మామగారికి వదిలి ఇంటి పనిలో జొరబడిపోయింది శాంతి.

వేలెడు లేదు వెధవ ప్రాణాలు తోడేస్తున్నాడు. ఒక్క వస్తువూ పెట్టిన చోట వుండనివ్వడుకదా! ఇటు సర్దు తుంటే అటు చిందరవందర చేసి పారేస్తుంటాడు.

నిన్నటికి నిన్న... ఇల్లు-ఇల్లంటూ సోఫాలోని కుషన్లన్నీ గది మూల బొమ్మరిల్లులా పెట్టి, ఆడుతూ- ఆడుతూ బ్లేడుతో కోసి పారేశాడు. ఇలాంటి అల్లరి పనుల్ని తెలియని పిల్ల చేష్టలుగా ఇంకా నెలరోజులు భరించాలని తల్చుకుంటేనే గుండె లయతప్పుతున్నది శాంతికి.

ఏమిటో! ఏడేళ్ళు కూడా నిండని వాడి ప్రాణానికి ఇంగ్లీషు చదువులంటూ- మొన్నటిదాకా పరీక్షల పేరుతో కాలు కదపనీకుండా కూర్చోబెట్టి చదివించాను



త్వరలో

# యండమూరి వీరేంద్రనాథ్



సీరియల్!!

కదా! 'పిచ్చి వెధవ' ఏదో నాలుగురోజులు వాడిష్టమొచ్చినట్టు వాడిని ఆడుకోనిస్తే మునిగిపోయేదేముందిలే అని తను అనుకుంటూ వుంటే వీడు మూడురోజులకే తన ఓపిక సగం లాగిపారేశాడు.

అప్పటికీ... వాడికి సరైన దెబ్బలు పడకనే ఇలా పేట్రేగిపోతున్నాడంటూ మామగారు కోపం చేసి నప్పుడల్లా బెల్టుతో దెబ్బలు తింటూనే వుంటాడు. అయినా ఆ క్షణం చల్లబడతాడు, మరుక్షణం మామూలై పోతాడు.

వాడు అల్లరిపన్లు చెయ్యకుండా బుద్ధిగా కూర్చోవా లంటే కథలు చెప్పాలి. కానీ రోజంతా కథలు చెప్తూ కూర్చోవడం తనకెలా కుదరుతుంది. కుదిరినా... ఆటా పాటా లేకుండా సెలవుల్లో కూడా వాడి కాళ్లా-చేతులూ కట్టేసి ఎంతసేపని వాడి చిన్ని బుర్రను పుస్త కాల ముందు కూర్చోబెట్టగలదు తను.

'పోనీ తనతోపాటే వాడినీ ఆ పనీ ఈ పనీ చెయ్యమని ప్రోత్సాహపరిస్తే...!' అలా అలా సాగుతున్న ఆలోచనలతోనే పని ముగించిన శాంతి మామగారికి భోజనం వడ్డించి, అప్పుడే నిద్రలేచిన మున్నీకి (చిన్నీ), అలిగి మూల కూర్చున్న బాబీకీ అలకతీరేలా కథలు చెప్తూ అన్నం తినిపించింది.

కథలతో అలకంతా మర్చిపోయిన బాబీ-నిద్ర తీరిన చిన్నీ మళ్ళా ఇల్లంతా పరుగులు పెడుతూ దాగుడు మూతలాట మొదలెట్టారు.

భోజనం ముగించి వంటిల్లు సర్దుకుంటున్న శాంతి చిన్నీ వేసిన కేకతో ముందుగదిలోకి వచ్చింది. అలమరా లోకి దూరి దాక్కుంటూ ఇంకు సీసా క్రిందపడేశాడు బాబీ. సీసా పగిలి ఇంకు గదినిండా చిందిపడింది.

ఆ పొరపాటు పనికి వాడినేవిధంగా శిక్షించాలో బోధపడని శాంతి గది శుభ్రం చేసి, కథలు చెప్తానంటూ తనప్రక్కన పడుకోబెట్టుకుంది పిల్లలిద్దరినీ.

సాయంత్రం శివరాం రాగానే ఆరోజు మనవడు చేసిన ఘనకార్యాన్ని చెపుతూ చివరగా "ఈ గడుగ్గాయిని ఈ మధ్య కొత్తగా పిల్లల కోసం పెట్టిన 'హాలిడేహోమ్స్'లో ఈ నెల రోజులపాటూ వుంచితే మంచిదేమోరా బాబూ!" అంటూ శలవిచ్చారు.

ఆ రాత్రి జరిగిన తర్జన-భర్జనల అనంతరం అంతా కలిసి మరునాడు బాబీని 'చిల్డ్రన్స్ హాలిడే హోమ్స్'లో చేర్పించుదామన్న నిర్ణయానికి వచ్చారు.

బాబీని 'హాలిడే హోమ్స్'లో చేర్చి వచ్చిన రోజున తుఫాను బీభత్సంలా వున్న ఇల్లంతా శుభ్రంగా తుడిచి సర్దుకుంది శాంతి. పెద్ద తుఫాను వచ్చి తగ్గినంత ప్రశాంతంగా వున్న ఆ ఇంట సాయంత్రమయ్యేప్పటికి గాలి స్తంభించిన అనుభూతితో విలవిల్లాడింది శాంతి మనసు.

మరునాడు ఏదో ఒక మూల కూర్చుని చడీ-చప్పుడూ లేకుండా ఆడుకుంటున్న చిన్నీ గునగున పాటలు తప్ప ఇల్లంతా బోసిపోయి జీవ కళ కోల్పోయిన అనుభూతికి లోనయ్యారు అప్పటిదాకా బాబీ తుఫాను సందడికి అలవాటుపడిన ఆ కుటుంబసభ్యులు.

రోజూ పిల్లల అరుపులూ-పరుగుల మధ్య హడా వుడిగా పని చేసుకునే శాంతికి, చేతినిండా పనిలేక సర్దిందే సర్దుతూ ప్రియమైన ఆటబొమ్మకోసం వెదుకు లాడే పసిపాపలా - ఆ గదిలోకీ - ఈ గదిలోకీ దిగులుగా తిరుగులాడింది శాంతి.

మూడోనాటి సాయంకాలానికి ఆ ఇంటిలోని స్తబ్ద తను భరించడం దుర్భరంగా తోచింది శాంతికి. అరల లోని 'ఆటబొమ్మలు' తమ ప్రియనేస్తం కానరాక మౌనంగా రోదిస్తున్న భావన కలుగగా శాంతి కళ్ళు చెమ్మగిల్లాయి. ఆటా-పాటా లేకుండా ఒంటరిగా కిటికీలో కూర్చుని దిగాలుగా రోడ్డువైపు చూస్తోంది చిన్నీ.

దూరంగా తండ్రి చేయి పట్టుకుని నడచి వస్తున్న బాబీని చూడగానే కిటికీలో నుంచి ఛెంగున దూకి 'అన్నా' అని అరుస్తూ ఒక్క పరుగున బాబీని చేరుకుంది చిన్నీ.

ఆ సాయం సమయాన చల్లగావీచిన పిల్లతెమ్మెరతో ఆ ఇంటిలోని ఆటబొమ్మలన్నీ జీవకళతో ఆహ్లాదంగా కదలాడుతూ తమ ప్రియనేస్తానికి స్వాగతం పలుకు తున్నాయి. ఆప్యాయంగా బాబీని హృదయానికి హత్తు కున్న శాంతి కళ్ళు నీ 'ఆట బొమ్మలు' కదలాడకుండా నే బ్రతుకలేనురా కన్నా అన్నట్టు జలజలా వర్షించాయి.

